


భర్తను ఆఫీసుకు పంపించి ప్రొద్దున కాఫీమరకలు పడి చెడిన టేబుల్ క్లాత్ కు అంచు వేద్దామని కూర్చొంది సంధ్య. అంతలో వాకిట్లో, "ఏమేనండి అమ్మాయిలు." అంటున్న తన 14 ఏళ్ళ ఆడ గొంతుక వినబడింది. వెళ్ళి తలుపుతీసింది. అప్పుడే తెల్లవారుతున్న సూర్యుడి లాంటి ఎఱ్ఱని జాకెట్టు, గులాబీ వాయిల్ చీర, మెడలో ముత్యాల నెక్లెసు, నానుతాడు, చేతిలో వెండి కుంకుమభరిణతో పాతికేళ్ళ యువతి నవ్వుతూ తన ముఖద్వారం ప్రక్కన నిల్చొంది. "సంధ్యగారు మీరేనా?" అంది ఆవిడ. అవునన్నట్లు సంధ్య తలూపింది. "మా అమ్మాయి పుట్టినరోజు యివాళ, పేరంటానికి రండి" అంటూ ఆవిడ బొట్టు పెట్టింది. "వదినా ఈవిడ మా లెక్కల టీచరు. బాగా చెప్తారు" అన్నాడు పక్కింటి శేఖర్. "మీ మరిది శేఖర్ పెద్దలెక్కలు కూడ బాగా చేసుకుంటాడు. తెలివిగలవాడు" అంది ఆవిడ. "అవన్నీ మావదిన చెప్పిందండీ" అన్నాడు శేఖర్. 'అలాగా. మీరు బాగా చెప్తారండీ ట్యూషను చెప్తారా?' నవ్వుతూ ఆవిడ ప్రశ్నించింది. "లేదండీ చిన్నపిల్లలకి బోధచేసి వారికి అర్థమయ్యేటట్లు చెప్పటం నాకిష్టం" సంధ్య సిగ్గుపడుతూ జవాబిచ్చింది. "నిలబడేవున్నారు. కూర్చోండి" అంది.

"వెళ్తానండీ ఇంకా పనుంది. ఈపూట స్కూలుకు వెళ్ళలేదు. సాయంత్రమైనా వెళ్ళాలి. సాయంత్రం పేరంటంకి ఈలోపలే అన్నీ చూసుకోవాలి. వస్తానండీ తప్పక వస్తారేమో" అని ఆవిడ వెళ్ళిపోయింది. మరిది స్కూలుకి వెళ్ళాడు.

సంధ్య టేబుల్ క్లాత్ అంచు వేస్తోంది. మధ్యాహ్నం భర్త వచ్చేసరికి అది అరవేయ్యకపోతే తిడతారు. ఆయన చాలా మంచివాడు. గబుక్కున పేరంటం పిల్చిన టీచరు గురుతు వచ్చింది... ట్యూషను... అబ్బా... నిట్టూర్చింది సంధ్య. అవును తనుకూడా ట్యూషను చదివి టీచరు చేస్తూ పై క్లాసులు చదవాలని ఒకప్పుడు ఎంతో ఉబలాట పడింది.

ఆరోజుల తను ఎస్. ఎస్. ఎల్. సి. మంచిమార్కులు తెచ్చుకు పాసయింది. సనాతనాచారాలుగల అమ్మ నాన్న వివాహం చేస్తానన్నారు ఇప్పుడెప్పుడే వివాహం చేసుకోనని నిష్కర్షగా చెప్పిందితను. అప్పుడు, తనకిలో చిన్నమాట అనే ధైర్యం ఉండేది ఇప్పుడు అసలుమాటే తోచటంలేదు..

అనుకోకుండా ఒకరోజున తన తాతయ్యగారు, మామయ్యవచ్చారు. అమ్మ, తాతయ్యగారు రెండురోజులు ఏమేమో మాటాడారు. మెల్లగా అమ్మ తన్ను పిలిచి 'అమ్మమ్మ చచ్చిపోయింది. ఎన్నాళ్ళు ఆయన, పిల్లలు అనదిక్కు లేకుండా వుంటారు. మామయ్య పెళ్ళయితే కోడలును, మనవలను చూచుకుంటూ తాతయ్యగారు కృష్ణా రామా అనుకుంటూ వుంటారు. ఏ గాలిపిల అయితే నీలాగ తాతయ్యగార్ని చూసుకుంటుందా? మామయ్యను చేసుకో సంధ్యా ఆడవాళ్ళకి ఇన్నాళ్ళు చదువు చాలు. మితం ఎక్కడికి. అమ్మ యింకా ఏమో చెప్పబోయింది." "నాకిప్పుడే పెళ్ళవద్దమ్మ" అరిచింది సంధ్య. తన ఆశయాలు వేరు. ట్యూషను చదవాలి. చిన్నచిన్న పల్లెలందరికీ పాఠాలు చెప్పాలి. టీచరు చేస్తూ తన తల్లిదండ్రులను సుఖపెట్టాలని ఉబలాటపడేది. తనబాధ ఎవరికీ అర్థముకాదు.

అమ్మ లోపల పని చేసుకుంటోంది. నాన్నగారు నిద్రపోతున్నారు. తాతయ్యగారేదో చదువుకుంటున్నారు. మామయ్య అప్పుడే యింటర్వ్యూనించి వచ్చాడు. తను చదువుకుంటున్న నవల అక్కడ పడేసి లేవబోయింది. "కూర్చో సంధ్యా" మామయ్య మృదువుగా అన్నాడు. మామయ్య మనస్సుకూడా చాల మృదువనుకుంది తను. ఇంత తన మనసులో లేదు అప్పుడు.

"ట్యూషను చదువుతావా?" నవ్వుతూ లాలనగా అడిగాడు. ఆనాడా నవ్వును చూసి ముగ్ధురాలైంది. తప్పుచేసినదానిలా సిగ్గుపడింది. ఇప్పుడనుకుంటోంది ఆ నవ్వు వెనకాల ఎంత విషముందని.

"నాకు విశాపట్నంలో ఉద్యోగమయింది సంధ్యా అక్కడే ట్యూషను చదువుదువుగాని. ఏం? నీకిష్టమేనా?" అమాయకంగా అడిగాడు చంద్రం మామయ్య.

ఒక్కొక్క దినంగా తాతయ్యగారు. తను కావాలని కోరుకొని ప్రాణేశ్వరుడుగా చూసే మామయ్య. తన మొండితనం చూసి నిస్సహాయులై నిట్టూర్చే అమ్మ నాన్నగార్లు; యింకొక ప్రక్క ఏనాటినుంచో ట్యూషను చదవాలని వేళ్ళతో నాటుకుపోయిన ఆకాంక్ష, ట్యూషను చదివిస్తా నంటున్న మామయ్య నాన్నగారు, అమ్మకోరిక మామయ్యను పెండ్లిచేసుకోవాలని నిశ్చయించుకుంది "అలాగే మామయ్యా అక్కడే చదువుకుంటూ ట్యూషను" అంటూ తాను... తలవంచుకొని వింటున్న అమ్మముఖము వికసించింది. అమ్మకోసమే తానీమాటంది

పెళ్ళయింది మామయ్యతో. భర్తవెంట చిన్నసంచితో విశాఖపట్నం వచ్చింది. ఇదివరకటికంటె ఇప్పుడు తాతయ్యగారు సంతోషంగా వుంటున్నారు కాని మామయ్య తనని అన్నిసుఖాలు, పనులకు ఉపయోగించే ఒక సుఖ్రకింద చూస్తున్నారు. ఇంటిలో పనంతా తనే చేయాలి. పాంటు షర్టుకి ఇస్త్రీచేయాలి. అప్పడాలు, వడియాలు పెట్టాలి. ఇల్లు రోజూ బూజు దులపాలి. సినిమాలు చూడటం, పుస్తకాలు చదవటం ఆడవాళ్ళకి కూడదంటారు. తానెంత అన్నీ చూస్తున్నారు. ఒక్కసారైనా పుట్టింటికి పంపించలేదు. ట్యూషను సంగతి అడిగితే నవ్వుతారు పిచ్చిదానా అని తన జాతి వ్యామోహం ఫో అన్నారు. మామయ్య ఇలా మారిపోతాడనుకోలేదు.

అప్పుడు అడవికుక్కలా స్వేచ్ఛగా ఉన్న తనని మచ్చికచేసి పెళ్ళికొప్పించడానికి అంతా ఉచ్చుపన్నారు. వాదిస్తే ఎదిరిస్తుందని వాదించకుండా లాలించి, మనసు కరిగించి వంచించారు.

ఇలా ఆలోచిస్తూ టేబుల్ క్లాత్ కు ఎంతసమయం పట్టిందో తెలియనే లేదు. అంతలో ధన్ ధన్ తలుపు చప్పుడు. ఉలిక్కిపడి సంధ్య త్వరత్వరగా తనభర్త అంత త్వరగా ఎందుకువచ్చారో అని ఆలోచిస్తూ తలుపు తీయటానికి వెళ్ళింది. ☆